ఈవారం కథ

# ముసుగు

## చల్లపల్లి స్వరూపరాణి




'రూమ్‌నెంబర్ 174 సృజనా! ఫోన్ కాల్' అని గట్టిగా బయటినుండి పిలవడంతో అప్పుడే నిద్రలోకెళుతున్న సృజన వులిక్కి పడింది. ఒక్క ఉదుటన మంచం మీదనుండి లేచి తలుపు గడియతీస్తూనే 'కమింగ్' అని అరిచింది. అలా అరవకపోతే ఆ హాస్టల్‌లో ఎవరో ఒకరు 'నో రెస్పాన్స్ రూమీజ్ లాక్డ్' అని ఫోను పెట్టేస్తారు. అప్పటికీ ఎక్కువగా పొద్దు పోలేదు. రాత్రి పదిన్నర అయింది. కానీ సృజనకి రాత్రి పదింటికే పడుకుని వుదయం ఆరుగంటలకు లేచే అలవాటు. 'నాకు ఇప్పుడెవరబ్బా ఫోను చేసేది. బహుశా నాన్న అయి వుంటాడు' అనుకుంటూ ఫోనుదగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళి 'హలో'అంది. అవతలనుంచి తన ప్రాణస్నేహితురాలు స్వప్న గొంతు.

'స్వప్నకి ఈ టైములో కొంపలంటుకుపోయే పనులు ఏముంటాయి... బహుశా వాళ్ళాయిన, ఆదీ కలిసి సినిమాకెళ్ళి తిరిగొస్తూ సరదాగా ఫోను చేసి వుండవచ్చు' అనుకొంది.

'ఏయ్.. స్వప్నా! ఏంటి సంగతులు...? ఇద్దరూ బయటికొచ్చారా...!' నిదానంగా అడిగింది.

'లేదు.. నేనొక్కదాన్నే మాట్లాడుతున్నాను. రేపు నీదగ్గరకొస్తున్నాను' చెప్పింది.

'అదేంటి ఒక్కదానివే రావడం? మీ ఆయన రాడా..?' అడిగింది సృజన.

స్వప్న నవ్వుతూ 'ఏం రాకూడదా..? అయినా మనకలాంటి భయాలేం లేవని తెలుసుగా? నిన్ను చూడాలని వుంది. ఇప్పటికే మనం కలుసుకుని ఆరునెలలయింది కదా! వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం!' అంది.

సృజన ఉత్సాహంగా 'సరే! రేపు ఉదయం చూస్తుంటాను. బస్ దిగగానే నేరుగా హాస్టల్‌కొచ్చేసేయ్!' అంది.

స్వప్నకి సృజనకి మూడు సంవత్సరాలుగా స్నేహం. ఇద్దరూ పీ.జీ.లే. ఒకే బ్యాచ్. ఒకే హాస్టల్‌లో వుండి చదువుకున్నారు. ఇద్దరి డిపార్ట్‌మెంట్‌లు వేరయినా అందరూ వారిని క్లాస్‌మేట్సనే అనుకునేవారు. స్వప్న పి.జీ.తో చదువుకి ఫుల్‌స్టాప్ పెట్టి ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టింది. సృజన అంతటితో ఆపకుండా రీసెర్చిలో చేరింది.

స్వప్నకి పి.జీ అయ్యాక పిల్లలందరికీ హాస్టల్‌కయ్యే ఖర్చు కలసివస్తుందని వాళ్ళ అన్నయ్య, తమ్ముడు, చెల్లెలు కలిసి సిటీలో ఇల్లు తీసుకున్నారు. సృజనది కృష్ణాజిల్లాలో పల్లెటూరు కావడం వలన పై చదువులకోసం తప్పనిసరిగా హాస్టల్‌లో వుండాల్సి వచ్చింది. స్వప్నతల్లి, తండ్రి స్వగ్రామం లోనేవుంటారు. వారిది వ్యవసాయక కుటుంబం.

సృజన తల్లి, తండ్రి స్కూలు టీచర్స్. చెల్లి, తమ్ముడు ఇంటి దగ్గర నుంచి పక్కటౌనులో కాలేజీకి వెళ్ళి వస్తుంటారు. సృజన చిన్నప్పటినుంచి చదువులో చురుకుగా వుండడమే కాకుండా ఆమె స్వతంత్ర ఆలోచనలు, ఇతరులను నొప్పించని స్వభావం ఆమె తండ్రికి గర్వకారణాలు. ఒంటరిగా ఎక్కడికైనా ధైర్యంగా పంపిస్తారు. అందరితో 'నా కూతురు ఏట్లో ఏసినా ఎదురీదుకుంటూ వస్తుంది' అంటాడు ధీమాగా.

సృజనకీ, స్వప్నకి ఆర్థిక స్థితిలో పెద్ద తేడా లేకపోయినా కులపరమైన వ్యత్యాసం ఎక్కువే! సృజన దళిత కుటుంబంలో పుడితే స్వప్నది అగ్రవర్ణం. అయినా వారిద్దరి మధ్య అటువంటి తేడాలుండేవి కాదు. పేరుకు తగ్గట్టు అన్నివిషయాలలోనూ క్రియేటివ్ అయిన సృజన అంటే స్వప్నకి అభిమానం. అలాగే అందరూ అమ్మాయిల్లాగా కాకుండా రాడికల్‌గా వుండే స్వప్న అంటే సృజనకి ప్రాణం. అటువంటి అమ్మాయి తన స్నేహితురాలు కావడాన్ని గొప్పగా ఫీలయ్యేది. కులమతాల పట్ల, సంప్రదాయాల పట్ల స్వప్నకి వుండే లెక్కలేనితనం అంటే సృజనకి క్రేజ్.

సృజనతో స్నేహంగా వుండే ఇతర అమ్మాయిలు స్వప్నకి గర్వం అనే సృజన అనవసరంగా ఆమెకు ప్రాధాన్యతనిస్తుందని తరచూ తన దగ్గరే విమర్శిస్తున్నా పట్టించుకునేది కాదు. పైగా తన లాగా. తన ఫ్రెండ్ స్వప్నలాగా వాళ్ళు మంచి పుస్తకాలు చదవరని వాళ్ళ తక్కువరకం అభిరుచికి తిట్టుకునేది. సృజన కులంవాడైన జీవన్ అనే అతనిని స్వప్న ప్రేమిస్తుంది. అతను చాలా పేదవాడు. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు. అటువంటప్పుడు స్వప్నకి తనది పెద్దకులం అనే గర్వం ఎందుకుంటుంది..? అని ఇతరుల విమర్శలను కొట్టి పారేసేది.

సృజన వెంటనే రీసెర్చిలో చేరింది. స్వప్న హాస్టల్ ఖాళీచేసి తన అన్నయ్య, తమ్ముడు, చెల్లెలు వాళ్లతో చేరింది. హాస్టల్‌లో స్నేహితురాలు లేకపోవడం సృజనకి వెలితిగా అనిపించినా ఆమె అదే వూర్లో వుండడం వలన తరచుగా వాళ్ళింటికి వెళ్ళిరావడం మొదలెట్టింది. క్రమంగా స్వప్న అన్నయ్య నరేంద్ర, తమ్ముడు సతీష్, చెల్లెలు కవిత కూడా సృజనకు స్నేహితులయ్యారు.

నరేంద్ర బాగా చదువుకున్నాడు. సిటీలోనే ప్రముఖ దినపత్రికలో పనిచేస్తున్నాడు. అతిజాగ్రత్తపరుడు. తాను రైతు బిడ్డనని గర్వంగా భావిస్తుంటాడు. వేగవంతమయిన పట్నం వాతావరణంలో, అన్ని తరగతుల స్నేహితుల మధ్య కూడా తన పల్లెతాలూకు మట్టివాసనను పోగొట్టుకోకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ వుంటాడు. కానీ ఇంటి బాధ్యత అంతా తననెత్తిన పడ్డట్టు అప్పుడప్పుడు భారంగా ఫీలయ్యేవాడు. కుటుంబ విషయాల్లో బాధ్యతగా వుంటాడని అందరూ అతనిని మెచ్చుకునేవారు. సృజనకు అతనంటే ప్రత్యేక అభిమానం.

స్వప్న తమ్ముడు సతీష్ డిగ్రీచదువుతున్నాడు. ఇంట్లో ఏదీ పట్టించుకోడు. కాలేజీకని బయటి కెళ్ళి స్నేహితులతో కాలక్షేపం చేసి ఎప్పుడో ఇంటికొస్తాడు.

ఇక కవిత విషయానికొస్తే ఆమె అందరికన్నా చిన్నది కావడం వలన గారాబం ఎక్కువ. ఎప్పుడూ సరదాగా వుంటూ అల్లరి చేస్తుంది. కవిత ఇంటికి దగ్గర్లోనే వున్న గర్ల్స్ కాలేజీలో ఇంటర్ చదువుతుంది. సృజనతో బాగా చనువుగా వుంటూ అన్ని విషయాలు మాట్లాడుతుంది.

స్వప్న కుటుంబంతో పాటు నరేంద్ర స్నేహితులు కొంతమంది తరచూ ఆ యింటికొస్తుంటారు. అందరితో పరిచయాలు స్నేహాలుగా మారాయి. ఇల్లు ఎప్పుడు కబుర్లతో, నవ్వులతో కళకళలాడిపోతుండేది. సృజనకి ఆ ఇంటితో విడదీయరానంతగా అనుబంధం ఏర్పడింది. అక్కడికెళ్ళడానికి ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ వుంటుంది. స్వప్న, కవితలు కూడా తరచుగా హాస్టల్ కొస్తుంటారు.

నరేంద్ర స్నేహితులు అంతా అగ్రకులాల వాళ్ళే! అంతా స్నేహంగానే మాట్లాడడంతో సృజన తను చాలాఉన్నతమయిన చోట వున్నట్టు భావించేది. తమను వూర్లో పైకులాల వారు నీచంగా చూడడం, తను బస్ దిగి వెళుతున్నప్పుడు రోడ్డుపక్కన కమ్మ ఇళ్ళల్లో 'ఈ అమ్మాయిఎవరు' అని గుర్తుపట్టని ముసలోళ్ళు అడిగితే తన తండ్రికి పేరుతేనట్టు 'మాలపంతులు కూతురు' అని తన ఎదురుగా చెప్పుకోవడం, పదో తరగతి పరీక్షలు రాశాక సెలవుల్లో నాన్నగారు తనకు సైకిల్ నేర్పిస్తుంటే 'నాలుగక్షరాలు నేర్చి, తింటానికి తిండి దొరగ్గానే ఈజాతికి మిడిసిపాటు' అని దారివెంట సణగడం అన్నీ మర్చిపోయింది.

హాస్టల్‌లో క్రిస్టియన్ అమ్మాయిల్ని ఉద్దేశించి ఒకసారి స్వప్న కూడా 'ఈ కిరస్తానీ అమ్మాయిలు చర్చికని వెళ్ళి భలే వెకిలి వేషాలేస్తారే! వాళ్ళంటే నాకు ఒళ్ళుమంట' అంది. తను చిన్నప్పుడు చర్చి కెళ్ళినా క్రమంగా దేవుడంటే నమ్మకం పోవడంతో 'కిరస్తానీ' అని తిట్టినందుకు అంతగా బాధ కలుగలేదు. ఆమె మాటలకు అభ్యంతరం తెలుపకుండా నవ్వింది.

స్వప్న చెల్లెలు కవిత తన చలాకీతనానికి అందరూ పొగుడుతుంటే ఇంకా 'డైనమిక్' అనిపించుకోవాలని రఫ్‌గా మాట్లాడేది. పెద్దరికంగా, మర్యాదస్తుడిలా వుండే నరేంద్ర ఆమె మాటలకు విసుక్కునేవాడు. ఒకసారి మాలా, మాదిగకొంపల్లో వుట్టాల్సిన దానివి పొరపాటున ఇక్కడ వుట్టావు అని సృజన ఎదుటే అన్నాడు. ఆమెకు మనసు చివుక్కుమంది. 'ఇతనికినా కులం తెలీదా?' అనుకుంది మనసులో. ఆ క్షణంలో బాధపడినా 'అతను తనతో మంచిగానే మాట్లాడుతున్నాడు కదా! అని తనకుతానే సర్ది చెప్పుకుంది.

స్వప్నకు జీవన్‌తో ముందునుంచీ పరిచయం వుంది. అది కొన్నాళ్ళకు ప్రేమగా మారింది. కులం పట్టింపులు, జీవన్ పేదరికం కారణంగాఅతనంటే స్వప్న ఇంట్లో వాళ్ళకిముఖ్యంగా వాళ్ళ అమ్మ, నాన్నలకు ససేమిరా ఇష్టం లేదు. అన్నయ్యాకి అభ్యంతరాలున్నా అవి కులానికి సంబంధించి కాదన్నట్టు వుండేవాడు. కులపరమైన అభ్యంతరం అని పైకి అంటే తన చదువు, ఆదర్శాలకు లభిస్తున్న గౌరవం ఎక్కడ తగ్గుతుందోనన్న భయం.

జీవన్ కూడా స్వప్న గ్రామానికి చెందిన వాడే కావడంవలన రెండు పక్షాల మధ్య ఘర్షణ తీవ్రంగా వుండేది. తర్వాత అతనికి ఉద్యోగం వచ్చి వైజాగ్ వెళ్ళిపోవడం స్వప్న చదువు గురించి ఈవూరు రావడంతో గొడవలు కొంతవరకు సద్దుమణిగాయి. అయినా ఎప్పుడన్నా కలిసినపుడు ఎలాగో నరేంద్రకి గానీ, వాళ్ళనాన్నకీగాని తెలిసి గొడవలయ్యేవి. జీవన్‌కి పర్మినెంట్ అయ్యాక పెళ్ళి చేసుకుందామని వత్తిడిచేస్తూ ఉత్తరాలు వ్రాయడం, తరచుగా కలవడంతో మళ్ళీ ఇంట్లో అశాంతి మొదలయ్యింది. స్వప్న మీద నిఘా ఎక్కువయింది. వాళ్ళ నాన్న వచ్చి 'మన ఇళ్ళల్లో ఊడిగం చేసి మన దయాదాక్షిణ్యాలతో బతికే కొంపల్లో నువ్వెట్లావుంటావే..? వాడిని పెళ్ళి చేసుకుంటే నేను ఆ వూర్లో తలెత్తుకోలేను. మేమంతా ముక్కుమూసుకుని చస్తాము. నీ చెల్లెలికి పెళ్ళి కూడా కాదు' అని దాదాపు ఏడ్చినంత పనిచేశాడు.

నాన్నగారు, అన్నయ్య ఎంత చెప్పినా వినకపోవడంతో ఇంట్లో గొడవలు తారాస్థాయికి చేరాయి. చివరికి స్వప్న రహస్యంగా జీవన్ దగ్గరకు వెళ్ళిపోవడం, అతని స్నేహితుల మధ్య పెళ్లి చేసుకోవడం వెంటవెంటనే జరిగాయి.

సృజనకి జీవన్‌తో పరిచయం తక్కువే అయినా అతని గురించి స్వప్న చెప్పే దానిని బట్టి అతనిని అభిమానిస్తూ వుండేది. ఇద్దరికీ స్వప్న వారధిలా వుండడంవలన ఒకరంటే ఒకరికి ఆత్మీయత. స్వప్న అలా పెళ్ళి చేసుకోవడం వలన ఆమె కుటుంబమంతా కలత చెందినా, సృజనకి మాత్రం ఎంతో తృప్తిగా అనిపించింది.

స్వప్న ఇంటి నుండి వెళ్ళిపోయాక సృజన దగ్గరకి నరేంద్ర వచ్చి 'ఆ అమ్మాయి అలా వెళ్ళకుండా వుండాల్సింది. నేను మా నాన్నగారిని ఒప్పించి పెళ్ళి మర్యాదగా జరిపించి వుండే వాడినికదా!' అని గంభీరంగా అన్నాడు తనకే అభ్యంతరాలు లేనట్టు. సృజనకి అతని పరిస్థితి అర్థమైనా అవునన్నట్టు తలూపింది.

నరేంద్ర తర్వాత వాళ్ళ నాన్నగారు వచ్చి 'నీ అండదండలు లేకపోతే అది ఇంతపని వుండేది కాదు. ఇలా చెయ్యడం నీకు మర్యాదగా వుందా..? అని జరిగిన దానికంతటికీ సృజనదేబాధ్యత అన్నట్టు తీవ్రమైన మాటలతో ఆమె మీద విరుచుకుపడ్డారు.

ఈ గొడవలన్నింటితో సృజన చదువు మందగించింది. అడిగిన వాళ్ళందరికీ చెప్పలేక అసహనం, అశాంతి కూడా ఏర్పడ్డాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ స్వప్న కుటుంబంలో ఆమె సృష్టించిన కలకలం సద్దుమణిగింది. ఆమె తల్లి దండ్రులు కూడా కూతురు మీద కోపాన్ని తగ్గించుకుంటున్నారు.


స్వప్న సంతోషంగానే వున్నట్టు ఫోనులో మాట్లాడినప్పుడు అనిపించినా, తీరా వచ్చాక ఆమెను చూస్తే సృజనకి ఏదో అనుమానం వచ్చింది. కబుర్లు చెప్పకొని విశ్రాంతి తీసుకున్నాక సాయంత్రం చిన్నగా 'ఇంకా ఏంటే విశేషాలు...? జీవన్ ఏమంటున్నాడు..? నువ్వేదో దాస్తున్నట్టున్నావు?' అంది.

స్వప్న తనదైన ధోరణిలో 'నిజం చెప్పనా? మా ఆయన్ని వదిలేసొచ్చా!' అంది.

ఇదేదో సరదాగా అంటున్నట్టుందిలే! అనుకుని నవ్వి ఊరుకుంది సృజన.

తర్వాత స్వప్న కల్పించుకుని నిజంగానే జీవన్‌కీ తనకీ ఏవిషయంలోనూ పొసగడం లేదనీ, తను అతనితో సర్దుకు పోలేక పోతున్నానని అటువంటి వాతావరణంలో యిమడలేకపోయానని చెప్పింది. మాటల మధ్యలో అతనికి సంస్కారంలేదని, అతని తల్లిదండ్రులు అనాగరికులని మొరటుగా ప్రవర్తిస్తారని అంది.

సృజనకు స్వప్న ఏం మాట్లాడుతుందో అర్థంకాలేదు. 'ఇంతకాలంగా అతనికి సంస్కారంవున్నదీ లేనిదీ అర్థం కాలేదా..?' అని మనసులో అనుకుని 'మీ ఇద్దరికీ ఒకరి గురించి ఒకరికి బాగానే అవగాహనవుంది కదా..! సమస్య ఎక్కడొచ్చింది మరి...?' అడిగింది. అతని తల్లిదండ్రుల గురించి స్వప్న మాట్లాడిన మాటలు మాత్రం సృజనకి కొరుకుడు పడలేదు. ఆ మాటలు తననే అంటున్నట్టు ఎక్కడో తెలియని నొప్పి, బాధ కలిగాయి. తనకి తెలిసినంతలో జీవన్ ఉత్తమ సంస్కారంతుడు. హుందాగావుంటాడు. కష్టపడి చదువుకొని ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతని ప్రవర్తనలో ఆత్మాభిమానం వ్యక్తం అవుతుంది. కానీస్వప్న అతనికి ఏమాత్రం సంస్కారం తెలియదని నిందిస్తూ పాపం అతని పేద తల్లిదండ్రులు వెనకబాటు తనాన్ని అసహ్యించుకుంటుంటే సృజనకి ఆమెను ఎలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదు. ఆమె గురించి తన అభిప్రాయాలు నమ్మకాలపై



— మిగతా 13 వ పేజీలో..

